భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి



నరసింహకొండలో విశేష పూజలు



అభిషేకిస్తున్న భక్తులు



భగవద్గీత శ్లోకాలపై రాత పోటీలు



ఇస్కాన్‌లో విశేషాలంకారం

నెల్లూరు(బృందావనం): కృష్ణాష్టమి పర్వదినాన్ని నగరంలో భక్తిశ్రద్ధలతో గురువారం జరుపుకొన్నారు. వివిధ ఆలయాల్లో కొలువైన స్వామివారికి అభిషేకాలు, పూజలు, అర్చనలను నిర్వహించారు. పలుచోట్ల ఉట్టి మహోత్సవాలు ఉత్సాహంగా సాగాయి. కృష్ణుడ్ని భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

• మినీబైపాస్ రోడ్డులోని ఇస్కాన్ మందిరంలో కృష్ణ జన్మాష్టమి వేడుకలను ప్రారంభించారు. మందిరంలో కొలువైన రాధాకృష్ణులకు అభిషేకాలను నిర్వహించారు. భజన కీర్తనలు, బాలకృష్ణుడికి ఊయలసేవ, మహాహారతి, 108 వంటకాలతో నివేదనను జరిపారు. బలరామసుభద్ర, జగన్నాథులు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. జన్మాష్టమి మహాప్రసాద వితరణను నిర్వహించారు. కృష్ణ జన్మాష్టమి సారికను ఇస్కాన్ మందిరాధ్యక్షుడు డాక్టర్ సుఖదేవస్వామి ఆవిష్కరించారు.

• ఎన్టీఆర్‌నగర్‌లోని సరస్వతీనగర్‌లో కృష్ణాష్టమి వేడుకలను ప్రబోధ సేవా సమితి – ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు శాఖ అధ్యక్షుడు సురమౌళి ఆధ్వర్యంలో నిర్వహించారు. భగవద్గీత శ్లోకాలపై రాత పోటీలకు 138 మంది విద్యార్థులు హాజరయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత నెల్లూరు మదన్‌మోహన్ రెడ్డి, వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ, గోపీ, సునీత, నవీన, సునీల్, రత్నం, లక్ష్మయ్య పెంచలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

• మహాత్మాగాంధీనగర్‌లోని కృష్ణ మందిరంలో రుక్మిణీ, సత్యభామ సమేత కృష్ణుడికి తులసీ దళాలు, సువర్ణ పుష్పాలతో పూజలు చేశారు. ఉట్టి మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. కోలాట ప్రదర్శనను మందిర కమిటీ సభ్యులు శ్రీదేవి ఆధ్వర్యంలో జరిపారు. గయోపాఖ్యానం, రామాంజనేయ యుద్ధ నాటకాలను లక్ష్మీచెన్నకేశవ నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. మందిర ధర్మకర్త వెంకటేశ్వర్లు, మందిర వ్యవస్థాపకుడు చిత్తూరు వెంకటేశ్వర్లు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

• క్రాంతినగర్‌లోని శివకేశవులు దేవస్థానంలో రుక్మిణీ, జాంబవతి సమేత వేణుగోపాలస్వామి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉభయకర్తలుగా శ్రీనివాసులు, రాజేశ్వరి, జలంధర్, రాజ్యలక్ష్మి దంపతులు, ప్రసాద్‌రెడ్డి వ్యవహరించారు. దయాకర్‌రెడ్డి, కోటేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ దర్శిగుంట పెంచలయ్య, సభ్యులు మల్లికార్జున, గోపీ, గోవిందు, నరసయ్య, మల్లికార్జున, సురేంద్ర, సాయి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

• మినీబైపాస్ రోడ్డులోని కృష్ణ మందిరంలో పూజలను నిర్వహించారు. సీతారామపురం మాజీ జెడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురవారెడ్డి, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు శ్రీనివాసులురెడ్డి, పాముల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

• బాలాజీనగర్ పిండిమిల్లు సెంటర్‌లో ఉట్టి మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. బాలాజీనగర్ యూత్ కొట్టే వెంకటేశ్వర్లు, జనసేన జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్ చెన్నారెడ్డి, తిరుపాల్‌రెడ్డి, రమేష్‌రాజు, జీవన్, శేఖర్, దుర్గ, శివ, చక్రి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

• నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఉభయదేవేరులతో కొలువైన రంగనాథుడు, కృష్ణుడికి తిరుమంజనం, పూజలు, గోపురోత్సవాన్ని జరిపారు. కృష్ణావతార ఘట్ట పురాణ పఠనం, సేవాకాలం శాత్తుమొరైను నిర్వహించారు.

• పప్పులవీధిలోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో 108 మంది మహిళలతో లక్ష తులసీ పూజను నిర్వహించారు. తిరుప్పావై సేవను జరిపారు.

నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో విశేష పూజలను నిర్వహించారు. నవనీతకృష్ణ స్వామి, కృష్ణావతార విగ్రహం వద్ద పూజలు చేశారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



శివకేశవులు దేవస్థానంలో వేణుగోపాలస్వామి కల్యాణం



రంగనాథుడి సన్నిధిలో..



మహాత్మాగాంధీనగర్‌లో ఉట్టి మహోత్సవం



కృష్ణ మందిరంలో కల్యాణం

క్లుప్తంగా

ట్రై సైకిల్ అందజేత



నెల్లూరు సిటీ: పేద కుటుంబానికి చెందిన దివ్యాంగుడికి ట్రై సైకిల్‌ను ఓం సాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు హరిబాబు, పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ వ్యవస్థాపకుడు రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో చోరీ

నెల్లూరు రూరల్: మొగళ్లపాళెంలోని రామాలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పూజలు చేసేందుకు ఆలయానికి గురువారం వచ్చిన అర్చకుడు చోరీ జరిగిన అంశాన్ని గుర్తించారు. ఆలయంలోని సీత అమ్మవారి మంగళసూత్రం, వివిధ దేవతామూర్తుల వెండి కిరీటాలు అపహరణకు గురయ్యాయి. వీటి విలువ సుమారు రూ.రెండు లక్షలు ఉంటుందని అంచనా. స్థానికుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజనుల సంక్షేమమే లక్ష్యం



మనుబోలు : గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా ఐటీడీఏ పనిచేస్తోందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాణి మందా అన్నారు. మనుబోలు సచివాలయం–1ను ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చల్లా యానాదులకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, వారి వివరాలన్నీ ఉన్నాయా.. అంటూ సచివాలయ సిబ్బందిని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 38 మండలాల పరిధిలో 1,231 గ్రామాల్లో ఎస్టీలు అధికంగా ఉన్నప్పటికీ వారికి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా? అనే విషయం తెలియడం లేదన్నారు. దీని కోసం ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా యాప్‌ను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికీ యానాదుల్లో చాలామందికి ఆధార్ కార్డులు లేవన్నారు. ప్రస్తుతం ఆధార్‌కార్డు లేకుంటే సంక్షేమ పథకాలు అందే అవకాశం లేదన్నారు. దీనివల్ల ఎస్టీలకు ఆధార్ నమోదు చేసేందుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో పనులకు వెళ్లే విధంగా వారికి అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లాలో ఆధార్ కార్డులు లేని 40 వేల యానాదులకు ఇప్పటికే ఆధార్ నమోదు చేయించామని, ఇంకా లక్ష మంది వరకూ ఆధార్ లేని వారు ఉన్నారని భావిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో యానాదుల ఇళ్లను గుర్తించే కార్యక్రమం చేస్తున్నామన్నారు. ఇది పూర్తయితే ఎవరెవరికి సంక్షేమ పథకాలు అందడం లేదో తెలుసుకుని వారికి పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం ఆమె సచివాలయ రికార్డులను పరిశీలించారు.

హెచ్‌ఐవీ, టీబీపై అవగాహన కల్పించాలి

బుచ్చిరెడ్డిపాళెం: ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి హెచ్‌ఐవీ, టీబీ, కుష్ఠు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా క్షయ, ఎయిడ్స్ అండ్ లెప్రసీ నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ తెలియజేశారు. మండలంలోని జొన్నవాడలో ఉన్న పీహెచ్‌సీని ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా హెచ్‌ఐవీ, టీబీ వ్యాధులతో పాటు కుష్ఠు వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ఆరోగ్య సిబ్బంది పనిచేయాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పిస్తే వ్యాధి సోకకుండా చర్యలు తీసుకోవచ్చని వివరించారు. ఇప్పటికే హెచ్‌ఐవీ, టీబీ, కుష్ఠు వ్యాధులు ఉన్న వారికి తగిన సూచనలిస్తూ తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకునే విధంగా ఆరోగ్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించి స్థానిక సమస్యలపై ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యుడు అహ్మద్‌బాబు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ఆక్వా ఉత్పత్తులకు అనుమతులు తప్పనిసరి

ముత్తుకూరు : ఆక్వా సాగుదారులు, ఆక్వా ఉత్పత్తిదారులు, సీడ్–ఫీడ్ అమ్మకం దారులు, ప్రాసెసింగ్ ప్లాంటుదారులు తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వాకల్చర్ అథారిటీ –2020 చట్టం ద్వారా తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎఫ్‌డీఓ సంజయ్‌స్టీఫెన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆక్వా సంబంధం లేని వెటర్నరీ గ్రేడ్ మందులు, నిషేధిత యాంటీబయాటిక్స్ విక్రయించడం నేరమని తెలియజేశారు. ఆక్వా రైతులకు నాణ్యమైన ఉత్పత్తులు విక్రయించాలన్నారు. లేకుంటే అధికారులు తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. లైసెన్సులు పొందేందుకు సమీపంలోని గ్రామ సచివాలయాల్లో ఉన్న మత్స్య సహాయకులు, మత్స్యశాఖ అధికారులను సంప్రదించాలన్నారు.

మార్కెట్లోకి హోండా ఎస్‌యూవీ ఎలివేట్



నెల్లూరు (టౌన్): హోండా ఎస్‌యూవీ ఎలివేట్ కారును మార్కెట్లోకి గురువారం విడుదల చేశారు. చెముడుగుంటలోని హోండా షోరూమ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో షోరూమ్ సీఈఓ దిలీప్ మాట్లాడారు. మాన్యువల్ వేరియెంట్ ధర రూ.10.99 లక్షల నుంచి రూ.14.99 లక్షలు, ఆటోమేటిక్ రూ.13.2 లక్షల నుంచి 15.99 లక్షల వరకు ఉందన్నారు. నాలుగు మోడళ్లలో ఎలివేట్ కారును విడుదల చేస్తున్నామని వివరించారు. మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ 15.31, ఆటోమేటిక్ 16.32 కిలోమీటర్ల మైలేజీని ఇస్తుందన్నారు. కారు బుకింగ్స్ ప్రారంభమయ్యాయని తెలిపారు. మేనేజర్ లక్ష్మణ్‌రాజ్, గిరీష్, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ర్యాలీలో వికాస్ మర్మత్

నెల్లూరు సిటీ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. నగరంలోని వీఆర్సీ సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు గురువారం నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. వ్యర్థాలు, చెత్తను తగలబెట్టడాన్ని మానుకోవాలని కోరారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, సంప్రదాయేతర ఇంధన వనరుల వాడకాన్ని ప్రోత్సహించాలని పేర్కొన్నారు. పర్యావరణ ఇంజినీర్ రాజశేఖర్, ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఎంహెచ్‌ఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు ప్రారంభం



మాట్లాడుతున్న అన్నపూర్ణ



కాకుపల్లిలోని లింగాయపాళెంలో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వెంకటేశ్వరపురం, రంగనాయకులపేటలోని ఉడ్‌హౌస్‌పేట ప్రాంతాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలను ఐసీడీఎస్ సీడీపీఓ అన్నపూర్ణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలో అందజేసే వైఎస్సార్ సంపూర్ణ బాలామృతంలో ఎక్కువ మోతాదులో పోషకాలున్నాయని, వీటిని బాలింతలు, గర్భిణులు తప్పక తీసుకోవాలని కోరారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలను చేయించుకోవాలని గర్భిణులను కోరారు. 53వ డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ సుజాత, జనార్దన్‌రెడ్డిలోని వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి దేశ్‌కుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు లక్ష్మీరాజ్యం, విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, పద్మజ, లక్ష్మి, విజయ, సుజాత, అరుణకుమారి, మాధవి, ప్రసన్న, శ్యామల, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: పౌష్టికాహారంపై అవగాహన అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప పేర్కొన్నారు. కాకుపల్లి సెక్టార్ పరిధిలోని లింగాయపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. కాకుపల్లి సర్పంచ్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



జెడ్పీ హైస్కూల్లో..



ప్యూర్ స్మైల్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో..

నెల్లూరు రూరల్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్లో పలువురు ఉపాధ్యాయులను జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, గౌరవాధ్యక్షుడు తుంగా నారాయణరెడ్డి, డిప్యూటీ గవర్నర్ మెట్టు సుధాకర్‌రెడ్డి, ప్రసాద్, ఖాజామస్తాన్, రాజగోపాల్, ఎస్తేరురాణి, హరిసుధ, హర్షవర్ధిని తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ప్యూర్ స్మైల్స్ సేవా సంస్థ కార్యాలయంలో ఏడుగురు ఉపాధ్యాయులను సత్కరించారు. కృష్ణాష్టమిని పురస్కరించుకొని వివిధ వేషధారణలతో అలరించిన 25 మంది చిన్నారులకు బహుమతులను అందజేశారు. సేవా సంస్థ నిర్వాహకురాలు పర్వీన్, బలరామయ్య, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

‘ఈఎస్సార్’లో ఉచిత కంప్యూటర్ శిక్షణ



నెల్లూరు (టౌన్): మూలాపేటలోని ఈఎస్సార్ మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణను చైతన్య సారథి ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకుడు బిక్కసాని పూర్ణచంద్రరావు మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణతో పాటు లైఫ్ స్కిల్స్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నామని వివరించారు. అనంతరం ట్రస్ట్ సీఈఓ మోహన్ మాట్లాడారు. 40 మంది అధ్యాపకులతో కంప్యూటర్ శిక్షణను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ట్రస్ట్ డైరెక్టర్ నాగరాజు, ప్రిన్సిపల్ శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన



నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను కమిషనర్ వికాస్ మర్మత్ గురువారం పరిశీలించారు. వెంకటేశ్వరపురంలోని గాంధీ గిరిజన కాలనీ, ఇసుక డొంక, రంగనాయకులపేట, తదితర ప్రాంతాల్లోని మున్సిపల్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, తదితరాలను కల్పించాలని ఆదేశించారు. సిటీ ప్లానర్ దేవీకుమారి పాల్గొన్నారు.

నగదు ఇవ్వలేదని హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): మద్యం తాగేందుకు నగదు ఇవ్వలేదనే అక్కసుతో ఓ వ్యక్తిని కత్తితో పొడిచిన ఘటనలో నిందితుడిపై నెల్లూరు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. మన్సూర్‌నగర్ మూడోవీధిలో పి.కుమార్ నివాసం ఉంటున్నాడు. అతను పొర్లుకట్ట సమీపంలోని ఓ వెల్డింగ్ షాపులో పనిచేస్తున్నాడు. ఈనెల ఆరో తేదీన తన స్నేహితుడు ఇస్మాయిల్‌తో కలిసి టీ తాగేందుకు పొర్లుకట్ట సబ్‌స్టేషన్ సమీపంలోని షాపునకు వెళ్లాడు. టీ తాగుతుండగా అదే ప్రాంతానికి చెందిన భిక్షు మద్యం తాగేందుకు నగదు ఇవ్వాలని కుమార్‌ను అడిగాడు. ఆయన లేవని చెప్పడంతో కోపోద్రిక్తుడైన భిక్షు తనవద్దనున్న కత్తితో కుమార్‌పై విచక్షణారహితంగా దాడిచేసి పరారయ్యాడు. గాయాలపాలైన కుమార్‌ను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. బాధితుడు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా సంఘీభావ యాత్ర

నెల్లూరు(వీఆర్సీసెంటర్): భారత్ జోడో యాత్రను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా సంఘీభావ యాత్రను పార్టీ నేత పల్లంరెడ్డి యశోధర ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కనకమహల్ సెంటర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం వద్ద ప్రారంభించిన యాత్ర ప్రభుత్వాస్పత్రి సమీపంలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వరకు సాగింది. నేతలు కనకట్ల రఘురామ్ ముదిరాజ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

• ఇందిరాభవన్ నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, మోహన్‌రెడ్డి, హుస్సేన్‌బాషా, గణేష్‌బాబు, లతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన

కోవూరు (విడవలూరు) : జాతీయ అంధత్వ నివారణ పక్షోత్సవాల సందర్భంగా విడవలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నేత్రదానంపై గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. నెల్లూరు మోడరన్ కంటి వైద్యశాల డాక్టర్ విష్ణుతేజ తదితరులు పాల్గొన్నారు.